క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



తెలకపల్లి: వర్మికంపోస్టు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం నిరంజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మహిళా సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ఉపాధి హామీ పథకంలో 2018–19 సంవత్సరంలో వంద రోజుల పని పూర్తి చేసుకున్న కూలీలకు వర్మికంపోస్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. శిక్షణకు వచ్చే లబ్ధిదారులు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, జాబ్‌కార్డు, రేషన్, పాన్‌కార్డులు, రెండు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.250 జాబ్‌కార్డు ద్వారా వారం రోజులకు సంబంధించిన వేతనం అందిస్తారని తెలియజేశారు. ఆసక్తి ఉన్న వారు స్త్రీశక్తి భవనంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీఎం నిరంజన్, భారతమ్మ, పార్వతమ్మ, సీసీలు నర్సింహ, నిరంజన్, సుజాత, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై అవగాహన



కల్వకుర్తి: పట్టణంలోని యూటీఎఫ్ భవనం, గాంధీనగర్ పాఠశాలలో ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్, రీయూస్, రీసైకిల్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం మాట్లాడారు. ఎవరి వద్దనైనా నిరుపయోగంగా ఉన్న వస్తువులు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, బొమ్మలు, చెప్పులు, బూట్లు వంటి ఇతర వస్తువులు ఏవైనా ఉంటే, వాటిని పాత మున్సిపల్ భవన కార్యాలయంలో అప్పగించాలన్నారు. ఈ వస్తువులను ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లు ఎవరికైతే అవసరం ఉంటాయో వారికి అందిస్తూ.. రీయూస్ చేస్తుందన్నారు. ఉపయోగం కాని వస్తువులను పునరుత్పత్తి చేసి పునర్వినియోగంలోకి తీసుకొస్తామని చైర్మన్ సత్యం చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ అశ్రిత్‌కుమార్, కౌన్సిలర్లు చైతన్యా రెడ్డి, బోజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఐపీసీ కోఆర్డినేటర్ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఉప్పునుంతల: మండలంలోని పిరట్వానిపల్లిలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణం పనులకు మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణం కోసం తనవంతు సాయం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మనోహర్, సర్పంచ్ శివుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



వెల్దండ: మండల పరిధిలోని కుందారంతండాలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి మంగళవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తి ద్వారానే ముక్తి లభిస్తుందన్నారు. ప్రజలందరూ భక్తిభావంతో మెలగాలన్నారు. ఆంజనేయస్వామి ఆలయాన్ని నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం అందిస్తుందని చెప్పారు. సర్పంచ్ కవితసరేందర్ నాయక్, రమేష్‌నాయక్, గన్యనాయక్, రమేష్ నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం

వెల్దండ: మండల పరిధిలోని కొట్రలో ఏర్పాటు చేసిన వేసవి కరాటే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం కరాటే శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండానే శిక్షణను నేర్చుకోవాలన్నారు. కరాటే ఆత్మరక్షణ, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు కరాటే, క్రీడలు ఎంతో అవసరమన్నారు. కరాటే మాస్టర్ కుమార్, నాయకులు నాగరాజుగౌడ్, అర్జున్, సాయి తదితరులు ఉన్నారు.



అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీ రాములు

వంగూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు రాములు అన్నారు. మంగళవారం మండల అధ్యక్షురాలు భీమమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సర్వసభ్య సమావేశానికి కొంత మంది అధికారులు ఆలస్యంగా వచ్చారు. దీంతో ఎంపీ రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో అనేక ప్రజాసమస్యలు చర్చకు వస్తాయని అన్నారు. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని, అదేవిధంగా అభివృద్ధి పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు కూడా కొంత ఆలస్యంగా వచ్చారు. 12.30కు ప్రారంభమైన సమావేశంలో అధికారులు ఆయా శాఖల పురోగతిని వివరించారు. వ్యవసాయం, విద్యుత్, పశువర్ధకశాఖ, వైద్య శాఖల్లో మూడు నెలల్లో చేపట్టిన ప్రగతిని వివరించారు. మండలంలోని వంగూరు, పోలకంపల్లి, జాజాల గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందడం లేదని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ విజయభాస్కర్, జెడ్పీటీసీ కేవీఎన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సంధ్యారాణి, సురేందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, హమీద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ శేఖర్‌గౌడ్

ఉప్పునుంతల: నకిలీ విత్తనాలు, కాలంచెల్లిన పురుగు మందులను విక్రయిస్తూ.. రైతులను మోసం చేయాలని ప్రయత్నించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఎస్‌ఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను, దుకాణంలోని నిల్వలను ఆయన పరిశీలించారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే ప్రభుత్వం ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి విధిగా రసీదు పొందాలని సూచించారు. తక్కువ ధరకు దొంగచాటుగా దొరికే నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి సాగుచేస్తే, దిగుబడి తగ్గి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఎవరైనా దొంగచాటుగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లంతోటబావితండా, లింగారెడ్డిపల్లి, పోతేపల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పరిశీలిచారు. ప్రజలు ఇళ్లలోని చెత్తచెదారాన్ని పంచాయతీ ట్రాక్టర్లకు అందించాలన్నారు. సిబ్బంది డ్రెయినేజీలు శుభ్రం చేసి ట్రాక్టర్ల ద్వారా ఎత్తివేయాలన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ కుమార్, ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, టీఏ రాజ్‌కుమార్, కార్యదర్శి మురారి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి



బీసీ నేతలతో జిల్లా విద్యార్థి విభాగం నాయకులు

తాడూరు: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ నేతలు మేలుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జిల్లా సమస్యలపై మంగళవారం రాష్ట్ర బీసీ నాయకులకు వినతి అందజేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జిల్లా కేంద్రంతో పాటు కొల్లాపూర్, కల్వకుర్తిలో బీసీ నాయకులు ఎమ్మెల్యేలుగా బరిలో ఉండాలన్నారు. నియోజకవర్గానికి ఇప్పటి వరకు 15 దఫాలుగా ఎన్నికలు నిర్వహించగా.. 10 శాతం కూడా లేని దొరలు, రెడ్లు 13 సార్లు అధికారంలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా నాయకులు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మాదిగలకు క్షమాపణ చెప్పాలి

అమ్రాబాద్: తుంగతుర్తి ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ మాదిగలకు క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితబంధు విషయంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులను ఎమ్మెల్యే బూతు మాటలతో అవమానించారని అన్నారు.

కమిషనర్‌కు వినతి

కల్వకుర్తి: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులు మంగళవారం వైద్య విధాన పరిషత్ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ రమేశ్‌కు వినతి అందజేశారు. పారామెడికల్ ఉద్యోగులు శ్రీకాంత్, తులసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రులతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వివిధ కేటగిరిలో కాంట్రాక్ట్ పద్ధతిన చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నా.. క్రమబద్ధీకరణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యాధికారికి వినతి



వినతి అందజేస్తున్న ఆశావర్కర్లు

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యంపై అవగాహన కల్పించి వైద్య సిబ్బందికి సహాయకులుగా ఉండే ఆశావర్కర్లకు పరీక్షలు నిర్వహించాలనే ఆలోచనను విరమించుకోవాలంటూ మంగళవారం వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాంకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్ మాట్లాడారు. 16 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఆశా వర్కర్లపై ఇటువంటి అనాలోచిత విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. అనంతరం వైద్యాధికారికి వినతి అందజేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, సఫియా బేగం, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణపై కార్యదర్శుల హర్షం



అధికారులను సన్మానిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కల్వకుర్తి రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. డీఎల్‌పీఓ పండరీనాథ్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ దేవేందర్‌లను సత్కరించి సంబరాలు చేసుకున్నారు.

అండగా నిలుస్తున్న ప్రభుత్వం

అచ్చంపేట రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ చెప్పడం సంతోషించదగ్గ విషయమన్నారు.

వెల్దండలో స్వీట్ల పంపిణీ

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు స్వీట్లు పంచుకున్నారు. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సునిత, మోహన్‌లాల్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

గిరిజన నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకొంటున్న నాయకులు

లింగాల: మాజీ ఎంపీపీ సభావట్ రాంలాల్ మనుమరాలు దీప్తిచౌహన్ సివిల్స్‌లో ఆల్ ఇండియా 630వ ర్యాంక్ సాధించడంపై మంగళవారం సంబరాలు జరుపుకొన్నారు. ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. శంకర్‌నాయక్, కిసన్‌నాయక్, హన్మంత్ నాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఊర్కొండ: మండలంలోని రాచాలపల్లికి చెందిన నరేష్‌గౌడ్ 102(అంబులెన్స్) డ్రైవర్‌గా పనిచేసేవారు. కొన్ని రోజుల కిందట అనారోగ్యానికి గురై మృతిచెందాడు. విషయాన్ని 102(పైలెట్) అసోసియేషన్ దృష్టికి డ్రైవర్ పరశురాములు తీసుకెళ్లాడు. స్పందించిన ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు కలిసి సంఘం తరపున రూ.30,000లు నరేష్‌గౌడ్ కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. నరేష్, చంద్రకాంత్, పరశురాములు, సందీప్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు: కేసు నమోదు

వెల్దండ: రాచూర్‌తండాలో మంగళవారం మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ, వెల్దండ పోలీసుల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తండాకు చెందిన దేవులి వద్ద 30 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా వడ్యావత్ గన్యనాయక్ వద్ద 30 కిలోల బెల్లం, 2.50 లీటర్ల సారా, 5 కిలోల స్పటిక స్వాధీనం చేసుకుని, 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. సారా తయారు చేసినా.. విక్రయించినా.. చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘునందరెడ్డి, ఎస్‌ఐలు విజయ్‌కుమార్, స్వర్ణలత, ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆటో, డీసీఎం ఢీ: ఒకరికి గాయాలు

తెలకపల్లి: ఆటో, డీసీఎం ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని లింగాల రోడ్డులో పెట్రోల్ బంక్ సమీపంలో బొప్పల్లికి చెందిన ఆటో తెలకపల్లి నుంచి బొప్పల్లి వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన డీసీఎం ఆటోను ఢీకొటింది. ప్రమాదంలో ఆటోలోని బొప్పల్లికి చెందిన నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో మరో ఇద్దరు మహిళలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. గాయపడిన నర్సయ్యను 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధికి అండగా ఉంటాం..

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్ల గ్రామ అభివృద్ధికి అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లెల్లలో పర్యటించారు. గ్రామం మొత్తం తిరగారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులను పరామర్శించారు. గ్రామస్తులతో సమస్యలపై ఆరా తీశారు. గ్రామంలో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. రవి, మల్లయ్య, మహేందర్, బీరయ్య, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లికల్‌లో వైద్యశిబిరం

కల్వకుర్తి రూరల్: మండలంలోని ఎల్లికల్‌లో వెంకటరమణ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు శరత్, రంజిత్ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ వైద్యులను సన్మానించారు. బాలస్వామి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్మన్‌బెట్లకు ప్రత్యేక బస్సులు నడపాలి

కొల్లాపూర్: పెద్దదేవర్ల పండుగను పురస్కరించుకుని జూన్ 4, 5 తేదీల్లో ఎన్మన్‌బెట్లకి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు జల్లాపురం సురేందర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆర్టీసీ డీఎం రాజేశ్వర్‌కు వినతి అందజేశారు. పండుగ కోసం గ్రామానికి వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

కేఎల్‌ఐ కాల్వకు లైనింగ్ పనులు చేపట్టాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రైతులకు వరప్రదాయిని కేఎల్‌ఐ కాల్వకు లైనింగ్ పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 2004లో మండలంలోని చందుబట్ల నుంచి అచ్చంపేట వరకు, ఇటు గుడిపల్లి నుంచి కల్వకుర్తి వరకు తవ్వీన కేఎల్‌ఐ కాల్వలకు లైనింగ్ పనులు చేయకపోవడంతో కోతలకు గురై మట్టి కొట్టుకుపోయి తెగిపోయే దశలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నీటి సరఫరా లేనందున లైనింగ్ పనులు చేసేందుకు అనువుగా ఉన్నాయని, కనీసం ప్రమాదభరితంగా మారిన చోట్లను అధికారులు గుర్తించి లైనింగ్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన కమిషనర్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ రమేశ్‌కుమార్

కల్వకుర్తి: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ రమేశ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇటీవల ప్రారంభమైన డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించి ఎవరికైనా సేవలందాయా అని ఆరా తీశారు. చాలా మంది కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారని వారికి మెరుగైన సేవలందించాలన్నారు. బాలింతలు ఉండే వార్డు సందర్శించారు. ఆస్పత్రి ఆవరణలో రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వద్ద డబ్బులు ఆశిస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ రాంబాబునాయక్, జిల్లా అధికారి రమేశ్‌చంద్ర, శివరాం, స్వర్ణలత, యశోదాబాయి, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గంగమోహన్

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నర్సరీల్లోని మొక్కలకు ప్రతిరోజూ నీటిని అందించి సంరక్షించాలన్నారు. నర్సరీ నిర్వాహకులు ఎప్పటికప్పుడు నర్సరీలను పరిశీలిస్తూ.. మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రజల నుంచి పంచాయతీలకు వచ్చే వివిధ రకాల పన్నులను వందశాతం వసూలు చేయడంతో పాటు గ్రామాల్లో అక్కడక్కడ ఏర్పడిన లీకేజీలను గుర్తించి వాటిని సరిచేయించాలన్నారు. సమావేశంలో ఏపీఓ ప్రవీన్, ఈసీ కిషన్ నాయక్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయ రెడ్డి

కొల్లాపూర్ రూరల్: ధ్యానంతో రుగ్మతలు దూరమవుతాయని, ఎలాంటి రుగ్మతలైనా.. ధ్యానం ద్వారా తగ్గించుకోవచ్చని పిరమిడ్ స్పిరీచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామాపురం, నర్సింగరావుపల్లి, చౌటబెట్ల, తాళ్ల నరిసింహాపురం గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజూ గంటసేపు ధ్యానం చేస్తే తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు ఉండే వ్యాధులు నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ధ్యాన ప్రచారకర్త గుండం తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం

కల్వకుర్తి రూరల్: సీఎం కేసీఆర్ రైతులకు మేలు చేసే కార్యక్రమాలు ఎన్నో చేపట్టడంతో పాటు ధాన్యం కొనుగోలు చేపట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర్ తెలియజేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తరుగు, తేమ పేరుతో మిల్లర్లు ఆరు కిలోల నుంచి 10 కిలోల వరకు కోత విధిస్తూ.. రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులతో కలిసి మంగళవారం మూడు మిల్లులు సందర్శిస్తే విషయాలు వెలుగు చూశాయన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నల్లబ్యాడ్జీలతో వీఓఏల నిరసన



కొల్లాపూర్ సమ్మె శిబిరంలో వీఓఏలు

కొల్లాపూర్: నల్లబ్యాడ్జీలు ధరించి వీఓఏలు సమ్మె శిబిరంలో కూర్చున్నారు. తమ డిమాండ్ల సాధనకు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిలో వీఓఏలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ.. నల్లబ్యాడ్జీలు ధరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. పానుగంటి నర్సింహ, అలివేలమ్మ, అమీన్‌పాష, చంద్రకళ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారానికి 37వ రోజుకు చేరింది.

వెల్దండ: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో వీఓఏల సమ్మెకు మంగళవారం మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్ సంఘీభావం తెలియజేసి రూ.5 వేల విరాళం అందజేశారు. జంగమ్మ, మహిపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం..



లింగాల: కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల కష్టాలను తొలగించేందుకు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని మగ్దూంపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పర్యటించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆ లక్ష్యాలు నెరవేరలేదని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చివేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రియాంకగాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, కొండల్‌రావు, సుధాకర్‌గౌడ్, వెంకటయ్య, జ్ఞానేశ్వర్‌రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

కందనూలు: బీఆర్‌ఎస్ నాయకుడు బైకాని శ్రీనివాస్ యాదవ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోడిదల రాము డిమాండ్ చేశాడు. మంగళవారం జిల్లా కేంద్రంలోనీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఓడిపోతాననే భయంతోనే కుల, మత రాజకీయాలు చేస్తున్నాడని, ఇటీవల కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుల, మతతత్వ రాజకీయాలు చేసిన బీజేపీకి ఏ గతి పట్టిందో, అదే గతి ఎమ్మెల్యేకు పడుతుందని హెచ్చరించాడు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ పేరిట గొల్ల, కురుమలను పట్టణానికి పిలిపించుకొని, దానిని రాజకీయ వేదిక చేసి పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డిపై ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చెప్పి, అమాయక గొల్లలను తప్పుదోవ పెట్టించేలా వ్యవహరించిన బైకానీ శ్రీనివాస్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిలకు త్వరలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మాజీ మార్కెట్ చైర్మన్ వల్లభ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్, శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కాటమోని హరీష్ గౌడ్, భాస్కర్, దినేష్, మస్తాన్, నాని గౌడ్ పాల్గొన్నారు

ఆరోపణలు సరికావు

కందనూలు: గొడవను ఆపడానికి వెళ్లిన నన్ను అకారణంగా పట్టణానికి చెందిన హరిబాబు నాపై దాడి చేయడమే కాకుండా, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరెకటిక సంఘం నాయకుడు ఆనంద్ ఆరోపించారు. మంగళవారం కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద ఆరె కటిక సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నేను గూండాయిజం, అక్రమ దందాలు చేసినట్లు హరిబాబు రుజువు చేస్తే నాపై ఉన్న ఆస్తులు ఆలయానికి రాసి ఇస్తానని అన్నారు. నాపై చేసిన ఆరోపణలు సరికావని, పరువు నష్టం దావా వేస్తానన్నారు. మోతిలాల్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని నోడల్ అధికారి వెంకటరమణకు బీజేపీ నాయకులు మంగళవారం వినతి అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు భీమేష్ మాట్లాడారు. 15 సంవత్సరాల నుంచి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. కృష్ణయ్య, మల్లేష్, శ్రీకాంత్‌రెడ్డి, మార్కండేయ, రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌కు ఎంపిక

వెల్దండ: జిల్లా కేంద్రంలో సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల క్రీడాకారులు ఖోఖోలో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలియజేశారు. మండలానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారులను ఆయన అభినందించారు. పీఈటీలు యాదయ్య, రవీందర్‌నాయక్, మురారి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

లింగాల: సీఎం కప్ పోటీలకు గాను మంగళవారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో లింగాలకు చెందిన క్రీడాకారుడు పృథ్వీరాజ్ షాట్‌పుట్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి పాండు తెలియజేశారు.



పృథ్వీరాజ్‌తో..



అభినందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు